నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక : 31 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 9-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

చీకటి సమయాన యేకమ్ముగా రాత్రి
తిరుగుటెల్లగాదు ధీరుడనగ
చిక్కులెన్నియున్న చిరునవ్వు చిందించి
నడుచునట్టి నరుడు నాగరికుడు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

## పెళ్లికి ముందు ఇద్దరు మేజర్ల ఇష్టపూర్వక
# శారీరక బంధాన్ని తప్పుపట్టలేం



- ప్రేమ విఫలమైతే మోసం చేసినట్టే అనలేమన్న ధర్మాసనం
- పాత కేసు ఆధారంగా ఉద్యోగ రద్దు చెల్లదని స్పష్టీకరణ
- లోక్ అదాలత్ రాజీని తప్పు ఒప్పుకున్నట్టుగా చూడొద్దు
- తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయానికి సుప్రీంకోర్టు చెక్

**న్యూఢిల్లీ:**
ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికిముందే శారీరక సంబంధం పెట్టుకుంటే వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని స్పష్టంచేసింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే వ్యక్తి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లికి ముందు

-మిగతా 2 లో

## అణ్వస్త్రాల సంఖ్య పెంచుకుంటున్న
# ఇండియా, పాక్



- భారత్ వద్ద 190.. పాక్ వద్ద 170 అణ్వస్త్రాలు
- కొత్త తరహా వార్‌హెడ్ వ్యవస్థల అభివృద్ధి
- చైనా నిల్వలు 620కు.. వేగంగా పెరుగుతున్న శక్తి
- ప్రపంచంలో 12,187 అణ్వస్త్రాలు: SIPRI నివేదిక

**న్యూఢిల్లీ:**
2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేది ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్

-మిగతా 2 లో



## తెలంగాణలో
# 'నాలెడ్జ్' విప్లవం

- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్
- సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ

-మిగతా 2 లో

## రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడితే
# ఊరుకోం

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి,
బండిలపై మండిపడ్డ సిఎం రేవంత్



- మెట్రో, మూసీ నిధులపై కేంద్ర మంత్రులకు సూటి ప్రశ్నలు
- ఇతర మహానగరాల వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి
- పరిపాలనా సౌలభ్యం కోసమే మూడు కార్పొరేషన్ల ఏర్పాటు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్లతో మౌలిక వసతుల పనులకు శ్రీకారం
- పేదలందరికీ ఎక్కడికక్కడే లక్ష ఇళ్ల నిర్మాణం
- కేసీఆర్, మోదీ పదేళ్ల పాలనపై అసెంబ్లీ చర్చకు సవాల్

**హైదరాబాద్,జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు.

-మిగతా 2 లో




## యుద్ధం
# వెంటనే ఆపాలి

- ఇరాన్, ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక
- కాల్పుల విరమణకు సిద్ధం కావాలని రెండు దేశాలకు సూచన
- త్వరలోనే శాంతి ఒప్పందం కుదిరే అవకాశం
- ఉద్రిక్తతలు తగ్గకపోతే మళ్లీ సైనిక చర్యలు: ట్రంప్
- చర్చల ద్వారా పరిష్కారమే మార్గమని అమెరికా అధ్యక్షుడి పిలుపు

**న్యూఢిల్లీ:**
ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్.. రెండు దేశాలూ తక్షణమే యుద్ధం ఆపాలని, కాల్పుల విరమణ పాటించాలని కోరాడు. ఇప్పటికే శాంతి చర్చలు కొనసాగుతున్నాయని,

-మిగతా 2 లో



## ఫిలిప్పీన్స్‌లో 7.8 తీవ్రతతో
# భారీ భూకంపం

- 15 మంది మృతి.. 200 మందికి పైగా గాయాలు
- సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు
- రోడ్లు, భవనాలు, వంతెనలకు భారీ నష్టం
- సహాయక చర్యలు ముమ్మరం.. అప్రమత్తమైన పొరుగు దేశాలు

**న్యూఢిల్లీ:**
ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఉదయం 7.37 గంటల సమయంలో 7.8 తీవ్రతతో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఈ భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంప ప్రభావంతో 15 మంది మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఫిలిప్పీన్స్‌లో భూంకపాలు రావడం సాధారణమే. అయితే, వాటి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి భూకంపం మాత్రం ఈ ఏడాదిలోనే చాలా పెద్దది. ఈ భూకంప కేంద్రం ఫిలిప్పీన్స్, నైరుతి జనలర్

-మిగతా 2 లో



# నేడు ఎపిలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

- గంటకు 40--50 కి.మీ. వేగంతో ఈదురు గాలుల అవకాశం
- పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రెడ్ అలర్ట్
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- విద్యుత్ అంతరాయాలు, వరద ముప్పుపై అధికారుల హెచ్చరికలు

**అమరావతి**
రాష్ట్రంలో మంగళవారం అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సోమవారం వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో

-మిగతా 2 లో

## ప్రభుత్వ భూములు కాజేస్తే
# ఉక్కుపాదమే

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ
అధికారులే దందాలకు పాల్పడ్డారు



- ఇందిరమ్మ ఇళ్ల స్థల పరిశీలనలో ఈ అక్రమాలు బయటపడ్డాయి
- దీనికి కారకులపై చర్యలు తీసుకున్నాం
- అక్రమ సేల్ డీడ్లను రద్దు చేయండి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

**హైదరాబాద్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను అంగుళం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించినా చూస్తూ ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే దోచుకునే ప్రయత్నం చేయడం

-మిగతా 2 లో



## రైలు ప్రయాణికులకు
# శుభవార్త..

- టికెట్ బుకింగ్‌కు ఇక నుంచి కొత్త సిస్టమ్..!
- నిమిషాల్లో లక్షల టికెట్ల బుకింగ్‌కు అవకాశం
- 1986 నాటి పాత వ్యవస్థకు పూర్తిగా వీడ్కోలు
- డిజిటల్ టికెట్ల వాటా 88 శాతానికి చేరిక
- వెయిటింగ్ లిస్ట్‌పై ఏఐ అంచనాలు.. 94% కచ్చితత్వం

**న్యూఢిల్లీ:**
భారత రైల్వే మంత్రిత్వ శాఖ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త 'ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ ను అందుబాటులోకి తీసుకురాబోతోంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది. ఈ సరికొత్త అప్‌గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది.ఈ కొత్త బుకింగ్ విధానంలో నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్‌కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల

-మిగతా 2 లో



## మహిళా శక్తి మహాసభకు
# సర్వం సిద్ధం

- మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి
- మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి
- రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపు

**హైదరాబాద్ జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు

-మిగతా 2 లో

### పెళ్లికి ముందు ఇద్దరు మేజర్ల ఇష్టపూర్వక

# శారీరక బంధాన్ని తప్పుపట్టలేం

మొదటి తరువాయి

ఓ మహిళతో శారీరక సంబంధం పెట్టుకుని మోసం చేశాడనే కారణంతో తెలంగాణ ప్రభుత్వం అతని ఉద్యోగాన్ని రద్దుచేసింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో తిరుపతిపై ఓ యువతి క్రిమినల్ కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకొచ్చాయి. ఈ పాత కేసును కారణం చూపిస్తూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అతని ఉద్యోగాన్ని రద్దుచేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. పోలీసు బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నంత మాత్రాన వారు పెళ్లి చేసుకోలేదనే ఒకే ఒక్క కారణంతో ఒకరు మరొకరిని మోసం చేశారని చెప్పలేమని స్పష్టంచేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీలేదని ధర్మాసనం పేర్కొన్నది. లోక్ అదాలత్‌లో కేసు రాజీపడినంత మాత్రాన అభ్యర్థి తన తప్పును ఒప్పుకున్నట్లు కాదని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకుని రాజీపడినప్పుడు.. సదరు అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేయడానికి పోలీస్‌బోర్డుకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. కేవలం విఫలమైన ప్రేమబంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం పూర్తిగా అన్యాయమని కోర్టు పేర్కొన్నది. చివరికి సుప్రీంకోర్టు తెలంగాణ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇచ్చిన రద్దు ఉత్తర్వులను పూర్తిగా కొట్టివేసింది. సదరు అభ్యర్థిని వెంటనే విధుల్లోకి తీసుకుని, తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతోపాటు శిక్షణకు పంపాలని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది.

### అణ్వస్త్రాల సంఖ్య పెంచుకుంటున్న

# ఇండియా, పాక్

మొదటి తరువాయి

ఇన్‌స్టిట్యూట్(ఎస్ఐపీఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతో పాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యవహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వద్ద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే మిస్సైళ్లు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలాంతర్గామికలు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఇంకా అదనపు మిస్సైళ్ల కోసం మరికొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారు చేస్తున్నట్లు సిప్రి తన రిపోర్ట్‌లో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటేనర్లకు తరలిస్తున్నట్లు కూడా రిపోర్ట్‌లో చెప్పారు. స్టాక్‌హోమ్ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్‌హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది. చైనాపై ఫోకస్‌తో ఇండియా తన లాంగ్ రేంజ్ వెపన్ సిస్టమ్‌లను తయారు చేసుకుంటున్నట్లు రిపోర్ట్‌లో తెలిపారు. దీంతో పాటు పాకిస్తాన్‌తో ఉన్న శత్రుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని కూడా ఇండియా తన ప్లానింగ్ చేస్తున్నట్లు సిప్రి నివేదికలో చెప్పారు. ఇక పాకిస్తాన్ అణ్వాయుధాల రిపోర్ట్‌ను సిప్రి ప్రజెంట్ చేసింది. అయితే జనవరి 2026 నాటికి పాకిస్తాన్ తన న్యూక్లియర్ నిల్వలను స్థిరంగా ఉంచినట్లు పేర్కొన్నది. ఆ దేశం వద్ద 170 వార్‌హెడ్స్ ఉన్నట్లు రిపోర్ట్‌లో వెల్లడించింది. ల్యాండ్, ఎయిర్ సామర్థ్యంలో బాగానే ఉన్నా.. సముద్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నది. అయితే రాబోయే దశాబ్ధంలో తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకోనున్నదని రిపోర్ట్‌లో పేర్కొన్నారు. జనవరి 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,187 అణ్వాయుధాలు ఉన్నట్లు స్టాక్‌హోమ్ సంస్థ తెలిపింది. మిలిటరీ వద్ద 9745 ఆయుధాలు ఉన్నాయని ఆ రిపోర్ట్‌లో చెప్పారు. ఇక 4012 మాత్రం క్షిపణులు, ఎయిర్‌క్రాఫ్ట్ లో నిక్షిప్తం చేశారు. రష్యా, అమెరికా దేశాలు సుమారు 2200 ఆయుధాలను హై అలర్ట్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. భారత్, చైనా దేశాలు కూడా హై ఆపరేషనల్ అలర్ట్‌లో వార్‌హెడ్స్‌ను పెట్టినట్లు తెలుస్తోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్ దేశాల వద్ద ఎంఐఆర్వీ టెక్నాలజీ అభివృద్ధి దశలో ఉన్నాయి. ఇక ఇండియా, పాక్, ఉత్తర కొరియా ఆ టెక్నాలజీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఎంఐఆర్వీ టెక్నాలజీ అత్యంత శక్తివంతమైందని భావిస్తున్నారు. ఇండియా కూడా ఇటీవల అగ్ని-5 మధ్యంతర క్షిపణి ద్వారా ఎంఐఆర్వీ టెక్నాలజీని పరీక్షించింది. మరోవైపు పాక్ మీడియం రేంజ్ క్షిపణులను డెవలప్ చేస్తున్నది.

# యుద్ధం వెంటనే ఆపాలి

మొదటి తరువాయి

ఇవి ముగిసిపోయే అవకాశం ఉందని, అతిత్వరలోనే ఒప్పందం కుదురుతుందని భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ ద్వారా వెల్లడించారు. ఇరాన్, ఇజ్రాయెల్ దాడులు చేసుకోవడం ఆపి, చర్చలకు సిద్ధం కావాలని ట్రంప్ సూచించాడు. ప్రస్తుతం ఉద్రిక్తతలు తగ్గించడానికి తాను ప్రయత్నిస్తున్నానని, అయితే, ఉద్రిక్తతలు తగ్గకపోతే మళ్లీ సైనిక చర్య తప్పకపోవచ్చని ట్రంప్ అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులు చేసిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించినట్లు ట్రంప్ చెప్పారు. చర్చలు సజావుగా సాగడానికి, శాంతి ఒప్పందం కుదరడానికి నెతన్యాహును ఒప్పించినట్లు ట్రంప్ వెల్లడించారు. చర్చలు తుది దశలో ఉన్నాయని, బుధవారం లోపు శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ తెలిపారు. ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడుల వల్లే మళ్లీ ఉద్రిక్త పరిస్తితులు తలెత్తాయని, దీంతో ఇజ్రాయెల్ ప్రతిదాడులకు దిగిందని ట్రంప్ వెల్లడించారు. మరోవైపు ఇరాన్ మళ్లీ చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో లెబనాన్‌లోని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను కూడా ట్రంప్ ఖండించారు. లెబనాన్‌పై సైనిక చర్యలు ఆపేయాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించానని ట్రంప్ తెలిపారు. దీనికి ఇజ్రాయెల్ వెంటనే అంగీకరించిందన్నారు.

# ఫిలిప్పీన్స్‌లో 7.8 తీవ్రతతో భారీ భూకంపం

మొదటి తరువాయి

శాంటోస్ నగరానికి దక్షిణాన ఉన్న మిండానో ప్రాంతంలో కేంద్రీకృతమైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. భూకంప ప్రభావంతో సునామీకి కూడా అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భూకంపం తీవ్రతతో చాలా బిల్డింగులు, రోడ్లు, బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. కొన్ని స్వల్పంగా ధ్వంసమైతే, ఇంకొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, జనజీవనం స్తంభించింది. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేసియా, మలేసియాకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లోని తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వాలు సూచించాయి. కూలిన శిథిలాల కింద ఎంతమంది ఉన్నారు అనే విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటిస్పష్టతా లేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జనరల్ శాంటోస్ నగరంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాలు రద్దయ్యాయి. భూకంపం కారణంగా జనరల్ శాంటోస్ నగరంలో స్కూళ్లలోని విద్యార్థుల్ని ఉన్నట్లుండి తరలిస్తున్న క్రమంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అనేక ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుల్తాన్ కుదారత్, సారంగాణివంటి ప్రాంతాల్లో మానిటరింగ్ సెంటర్లలో సునామీ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# రైలు ప్రయాణికులకు శుభవార్త..

మొదటి తరువాయి

సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగరాదని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్‌ను ప్రారంభించింది. అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది. రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గత ఏడాది జూలైలో ప్రారంభించిన 'రైల్ వన్' యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాదిలోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్‌లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్‌ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది. కొత్త సిస్టమ్‌తోపాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా..? అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. దీని అంచనా కచ్చితత్వం గతంలో 53 శాతంగా ఉండగా.. ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది. దీనివల్ల ప్రయాణికులు తమ ప్రయాణ ప్లాన్లను మరింత సులభంగా మార్చుకోవచ్చు.

# రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడితే ఊరుకోం

మొదటి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.

# తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం

మొదటి తరువాయి

యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్స్ ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడం కోసం రూ.5 కోట్ల నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం 2016లోనే దీనికి శంకుస్థాపన చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల నిర్మించలేకపోయిందన్నారు. మా ప్రజాప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సంకల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ.110 కోట్లని, ఈ ఏడాదే పనులు వేగంగా జరగడానికి బ్జడెట్ లోనే రూ.50 కోట్లను కేటాయించినట్లు

డిప్యూటీ సీఎం ప్రకటించారు.

# నేడు ఎపిలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

మొదటి తరువాయి

అప్రమత్తంగా ఉండాలని ప్రజలను విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాల సూచన ఉందని తెలిపింది. ఇక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో పాటు వర్షాలు పడతాయని తెలిపింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వైఎస్సార్ కడప జిల్లాలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాల కురుస్తాయని సూచించింది. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే భారీ హోర్డింగ్స్ ప్రాంతాల్లో ఉండ వద్దని ప్రజలకు తెలిపింది. ల్గ÷తులు, పశువుల కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు వినిపించగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని స్పష్టం చేసింది. తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో 42 - 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎండ తీవ్రత కొనసాగనుందని తెలిపింది. పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 40 - 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నెలకొంటాయని చెప్పింది. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగనుందని విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. అయితే సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరులో 41.7 డిగ్రీలు, చిట్యాలలో 41.4 డిగ్రీలు, ఎస్. రాయవరంలో 41.2 డిగ్రీలు, పెదపారుపూడిలో 41 డిగ్రీల గరిష్ఠ

ఉష్ణోగ్రత నమోదు అయిందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# ప్రభుత్వ భూములు కాజేస్తే ఉక్కుపాదమే

మొదటి తరువాయి

దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాము నాయక్ 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్పై హౌసింగ్ బోర్డులో ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్‌గా పని చేసి అక్రమాలకు పాల్పడ్డారు. హైదరాబాద్, కూకట్‌పల్లి పరిధిలో హౌసింగ్ బోర్డు భూములను పరిశీలిస్తున్న సమయంలో ఆయన భూలీలలు బయటకు వచ్చాయి. హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలాన్ని రామునాయక్ 2018, ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్టు బయటపడింది. హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగం పోగొట్టుకున్న ఇఫ్తార్ అహ్మద్ భార్య సుబియా సుల్తానా పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఆ డబ్బులు నేటి వరకూ బోర్డుకు జమ కాలేదు. అప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన చార్మినార్ సబ్ రిజిస్ట్రార్ పై కూడా విచారణకు ఆదేశించాం అని మంత్రి తెలిపారు.

2017 నుంచే కేసులు.. రామునాయక్ భూ దందాలకు సంబంధించి 2017 నుంచి పలు కేసులు ఉన్నాయన్నారు. అప్పట్లో బీఆర్ఎస్ పాలకులు, అధికారులు స్పందించలేదని మంత్రి చెప్పారు. విజయవాడ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జా గూడలో 22 చదరపు గజాలు, లక్ష్మీగూడలో 130 చదరపు గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 చదరపు గజాల స్థలాలను రామునాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించగా వాటిపై విచారణ చేస్తున్నామన్నారు. రామునాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేశామని, విచారణ పూర్తి చేసిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రకటించారు. ఈ అక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించామన్నారు. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు.

ఏ హోదాలో ఉన్నా వదిలిపెట్టం..

ప్రభుత్వ భూములపై కన్నేసిన వారెవరినీ వదిలిపెట్టామన్నారు. ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే తేల్చి చెప్పారు. ప్రభుత్వ భూములను కొల్లగొట్టే అధికారులకు ప్రభుత్వ సేవలో కొనసాగే అర్హత లేదన్నారు. ఇలాంటి వారిని గుర్తించి శాశ్వతంగా తొలగించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజల ఆస్తులను కాపాడటం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

మొదటి తరువాయి

25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అ÷-దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్‌ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. ÷రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

# నారాయణపల్లిలో ప్రత్యేక గ్రామసభ

**-ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు**




గ్రామ సభలో పాల్గొన్న ఎంపీడీవో భాస్కరరావు సర్పంచ్ రంగు లత శ్రీనివాస్ గౌడ్

**ఎలిగేడు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నారాయణపల్లిలో సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామాభివృద్ధి, ప్రజాంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించారు. సభలో ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎల్‌నినోకు సంసిద్ధత, వర్షాకాలంలో వ్యాధుల నివారణ, సాగునీటి నిర్వహణ, విద్యుత్ సరఫరా, ఎన్ఎఫ్బీఎస్ పథకం వంటి అంశాలపై చర్చ జరిగింది. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్--2020 గురించి వివరించి, ప్రతి ఇంటివద్ద చెత్తను తప్పనిసరిగా వేరుచేసి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ రావు, సర్పంచ్ రంగు లత--శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచు కొత్తిరెడ్డి బాపురెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాపయ్య, ఏవో ఉమాపతితో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో బడిబాటపై అవగాహన

**-విద్యార్థుల చేరికకు ప్రజా ప్రతినిధుల పిలుపు**




ఎలిగేడు లో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కప్పల ప్రవీణ్



సుల్తానాపూర్ లో బడి బాటపై ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**ఎలిగేడు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంతో పాటు ధూళికట్ట, సుల్తానాపూర్ గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలు, అలాగే మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యా సౌకర్యాలు వంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఎలిగేడు కేంద్రంలో ఆరుగురు విద్యార్థులను బడిబాటలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, కవ్వంపల్లి బాపయ్య, ఎంఈఓ నరేంద్రచారి, హెచ్ఎంలు గంద్ర దేవేందర్రావు, బిజిల్లి సదయ్య, ఏఏపీసీ చైర్‌పర్సన్ రేఖతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జూన్ 10న కలెక్టరేట్ ముందు ధర్నాకు పిలుపునిచ్చిన సిపిఐ

**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పదేపదే ధరలు పెంచి సామాన్యులపై భారాన్ని మోపుతోందని ఆయన విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరలు పెరగడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నారని ఆయన అన్నారు. ధర్నాను విజయవంతం చేయడానికి సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జూన్ 10న కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ ప్రకటించింది.

# సర్పంచ్ ను సన్మానించిన విజ్ఞాన్ హైస్కూల్ ఉపాధ్యాయులు



సర్పంచ్ ప్రవీణ్ ను సన్మానిస్తున్న విజ్ఞాన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ కొమురయ్య

**ఎలిగేడు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ను సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో విజ్ఞాన్ హైస్కూల్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి సత్కరించారు. సర్పంచ్ ప్రవీణ్ గతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్గా పనిచేసి అనేకమంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారని ఉపాధ్యాయులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కొమురయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు శృతి, దీప, పుష్పలత, మమత, సుజాత, వప్న, జమున, రమ్య, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎల్లమ్మ బోనాలు




రేణుక ఎల్లమ్మ బోనాలకు ముస్తాబైన దేవాలయం

**ఎలిగేడు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఉత్సవాల కోసం శ్రీరేణుక--ఎల్లమ్మతల్లి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# రెండు గ్రామాల్లో నేల సంరక్షణపై గ్రామసభలు




రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో ఉమాపతి పాల్గొన్న సర్పంచ్ రంగులత శ్రీనివాస్ గౌడ్




రాములపల్లెలో పాల్గొన్న ఎంపీడీవో భాస్కరరావు సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్

**ఎలిగేడు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి, రాములపల్లి, లాలపల్లి గ్రామాల్లో శనివారం 'కేతి బచావో' (నేల సంరక్షణ) అభియాన్ పై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఉమాపతి రైతులకు నేల ఆరోగ్యం, భూసార పరిరక్షణ, సహజ ఎరువుల వినియోగం గురించి వివరించారు. పంట పొలాల్లో వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్ని ఎరువుగా మార్చాలని సూచించారు. "వరి కొయ్యలను కాల్చడం వల్ల సూక్ష్మజీవులు, సేంద్రీయ కర్బనం, పోషకాలు నశించి భూసారం క్షీణిస్తుంది" అని హెచ్చరించారు. అలాగే ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వర్షాభావం గురించి వివరించి, రైతులు స్వల్పకాలిక రకాల పంటలు, ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రంగు లత--శ్రీనివాస్ గౌడ్, సిద్ధి తిరుపతియాదవ్, ఉపసర్పంచు కొత్తిరెడ్డి బాపురెడ్డి, ఎంపీడీవో భాస్కర్ రావు, ఉద్యానవన అధికారి మహేష్, విద్యుత్ ఏఈ సంపత్ కుమార్, ఏఈఓ సురేష్, పంచాయతీ కార్యదర్శులుతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన

**కూకట్పల్లి జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



శంఖుస్థాపన కార్యక్రమంలో ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు ప్రజా ప్రతినిధులు అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు

# మృగశిర కార్తి శుభాకాంక్షలు

**-మెదక్ జిల్లా ప్రజలకు గడప దేవేందర్ సందేశం**

**మెదక్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మృగశిర కార్తి సందర్భంగా మెదక్ జిల్లా మత్స్యకారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లా ప్రజలందరికీ మెదక్ జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు గడప దేవేందర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగానికి అనుకూల పరిస్థితులు నెలకొనాలి. రైతులు సాగు చేసిన పంటలు పండిపంటలుగా కళకళలాడాలి. ప్రకృతి అనుకూలించి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలి" అని ఆకాంక్షించారు. అలాగే రైతులకు రుతుపవనాలు బాసటగా నిలిచి, సమయానికి వర్షాలు కురవడం ద్వారా మంచి దిగుబడులు సాధించాలని ప్రార్థించారు. "వ్యవసాయమే దేశానికి వెన్నెముక. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని పిలుపునిచ్చారు. మృగశిర కార్తి రైతాంగ జీవితాల్లో సిరిసంపదలు నింపాలని ఆకాంక్షిస్తూ మరోసారి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతి




**దేవరకొండ, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గాంధీనగర్‌కు చెందిన చేరిపల్లి భార్గవి (భర్త గోవర్ధన్) స్వంత ఇల్లు లేక అద్దె ఇంట్లో నివసిస్తున్నామని, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. "మానవతా దృక్పథంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి" అని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ప్రజల భాగస్వామ్యంతో పట్టణాభివృద్ధి

**-షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



**షాద్‌నగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 9, 18, 21, 26వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కమిషనర్ సునీత రెడ్డి హాజరై ప్రజలతో సమావేశమయ్యారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. "పట్టణాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి" అని చైర్మన్ సూచించారు. ఈ సభల్లో వార్డు కౌన్సిలర్లు వసంత, సంతోషిబాయి చందూలాల్, ఎస్పీ శివ, అశోక్, బచ్చలి నరేష్, కో-ఆప్షన్ సభ్యులు సుజీవన్, సయ్యద్ ఖదీర్, తంగడపల్లి శంకర్, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

# మాడుగులలో ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

**-సుంకిరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శిక్షణ కేంద్రం**

**మాడుగుల, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మాడుగుల మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రంలో అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ సూదిని జైపాల్ రెడ్డి పాల్గొని అభ్యర్థులకు మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ, "గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. నిపుణుల శిక్షణతో పాటు ఉచిత స్టడీ మెటీరియల్, మార్గదర్శకత్వం అందించడం అభినందనీయం" అని అన్నారు. అభ్యర్థులు మాట్లాడుతూ, "ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెటీరియల్ కొనలేని పరిస్థితుల్లో ఉచితంగా అందించడం మాకు ఎంతో ఉపయోగకరం. ఉద్యోగ సాధనలో సుంకిరెడ్డి సహకారం ఆశాకిరణంగా మారింది" అని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, లెక్చరర్ల బృందం పాల్గొన్నారు.

# వృక్షో రక్షతి రక్షితః

------------

-ఆది నుండి
అనాది వరకు
సమస్త జీవుల మనుగడకు
పునాది చెట్టు
-ఆదిమానవులకు
పండ్లనిచ్చి ప్రాణాన్ని
ఆకులనిచ్చి మానాన్ని
నిలిబెట్టింది చెట్టు
-అడవిలో
అనవసరపు కట్టె
అగ్గి రాబట్టి
పచన ప్రక్రియను చేపట్టి
మానవ నాగరికతకు
తొలిమెట్టయింది చెట్టు
-క్రూర మృగాలతో
సతమతమవుతున్న మనిషికి
చేతి కట్టయి
చేయూతనిచ్చింది
తొలి పని ముట్టయి
తోడ్పాటునిచ్చింది
ఆయుధమై
ఆదుకుంది చెట్టు
-గుడిసెలకు, ఇండ్లకు
కర్రనిచ్చి
గుడిలోని వేలుపయింది చెట్టు
-మేడలకు మిద్దెలకు
బుద్ధిలేక
పెద్ద మొత్తంలో కలపనిచ్చి
సుద్ద ముద్దయిపోయి
కలత చెందింది చెట్టు

-ఆదిమానవుడు
ఆధునిక మానవుడయ్యాడు
ఆశ అనేది
అత్యాశ, దురాశగా
పరివర్తన చెందింది
తనకు పట్టునిచ్చిన
చెట్టు పనిపట్టి
అడవిని చెరబట్టి
పట్టుగొమ్మనే
పనిగట్టుకుని
కిరాతకుడై
నరుకుతున్నాడు
-వృక్షరాజాలన్నీ
రాక్షస క్రీడలకు
రాలిపోతుంటే
అడవి తల్లి హృది
అవిసిపోతుంది
పుడమి తల్లి మది
కుమిలిపోతుంది
-ఓ మానవా!
నువ్వు మారురా!
వీలైనన్ని
చెట్లు పెట్టు
వన సంరక్షణకు
కంకణం కట్టు
చైతన్య కార్యం
తలపెట్టు
నాటిన మొక్కలను
నిలబెట్టు
అడవుల్ని నరకడం
అరికట్టు
కలప స్మగ్లర్ల
భరతం పట్టు
భావి తరాలకు
మేలు తలపెట్టు
భూతల్లికి
హరిత ఛత్రం పట్టు

Ch. శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం: ఎలిగేడు

( ఈ వర్షాకాలంలో అందరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆశిస్తూ రాసిన కవిత )



# మృగశిర కార్తె సందడి

## -మెదక్‌లో కిక్కిరిసిన చేపల మార్కెట్



**మెదక్, జూన్ 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మృగశిర కార్తె సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంది. మెదక్ మండలంలోని కొముటూరు చెరువు, నాగపూర్, హవేలి ఘనపూర్, మంబోజిపల్లి, పాతూర్ గ్రామాల్లో చేపల విక్రయాలు జోరుగా జరిగాయి.కార్తె తొలిరోజున చేపలు తినడం స్థానిక ప్రజల ఆనవాయితీ కావడంతో, మెదక్ పట్టణ మార్కెట్ సహా తాత్కాలిక విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.ఉదయం నుంచే మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొని, చెరువుల నుండి సేకరించిన తాజా రొహు, బొచ్చె (కట్ల) వంటి చేపలను పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచారు.

# 'మృగశిర కార్తె' సందడి





**ఆమనగల్లు, జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మృగశిర కార్తె వేడుకలను సోమవారం పల్లె, పట్టణం తేడా లేకుండా ఘనంగా జరుపుకొన్నారు. మృగశిర కార్తె నాడు చేపలు, మాంసం తింటే ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. ఎక్కువగా చేపలు తినేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో మాంసం, చేపల విక్రయ కేంద్రాలు తెల్లవారుజాము నుంచే రద్దీగా మారాయి. నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది. ఆమనగల్లు పట్టణంతో పాటు తలకొండపల్లి, మాడుగుల, కడ్తాల్, మండల కేంద్రంలో చేపల విక్రయ కేంద్రాలు కొనుగోలు దారులతో సందడిగా కనిపించాయి. ఆమనగల్లు సుర సముద్రం వివిధ గ్రామాల చెరువుల్లో పట్టిన చేపలను భారీగా తీసుకొచ్చి విక్రయించారు. సాధారణ రోజుల్లో రూ.140 నుంచి రూ. 160 ధర ఉండే బొచ్చ, జల్లలను రూ.180 నుంచి రూ.200 వరకు, కొర్రమీను రూ.500 నుంచి రూ. 800 వరకు కిలో చొప్పున విక్రయాలు చేపట్టారు. ఈ రోజున మాంసం తినని వారు ఇంగువ, బెల్లం కలిపి భుజించారు. తద్వారా వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా శరీరంలో జీర్ణక్రియ మారుతుందని పెద్దలు చెబుతున్నారు. కాగా, మృగశిర కార్తె ఆరంభంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వానాకాలం సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

# సిఎం సభా ఏర్పాట్లలో ప్రజా నాయకుడు సి ఎం ఆర్ .




**కూకట్పల్లి జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 2000 వేల కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి విచ్చేస్తున్న ప్రజా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ నిత్యం నియోజకవర్గ ప్రజల కోసం కృషి చేస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే పి ఏ సి చైర్మన్ అరెకపూడి గాంధీతో ఈరోజు జరిగే బహిరంగ సభలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు (సి ఎం ఆర్)

# సింగరేణి పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభం




**మందమర్రి జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని కళ్యాణిఖని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రధానోపాధ్యాయుడు జే. పురుషోత్తం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 1 నుంచి 30 వరకు ప్రవేశాలు నిర్వహిస్తుండగా,తల్లిదండ్రులు అవసరమైన ధృవపత్రాలతో పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు 555 మార్కులు,10 మంది 500కు పైగా మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారని తెలిపారు. పాఠశాలలో డిజిటల్ తరగతి గదులు,సైన్స్ ల్యాబ్‌లు,గ్రంథాలయం, మినరల్ వాటర్ ప్లాంట్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

# గ్రామాభివృద్ధి కోసం గ్రామసభ



**మర్రిగూడ, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ ఎంపిఓ సమక్షంలో గ్రామ సర్పంచ్ లఫంగి నరసింహ అధ్యక్షత వహించారు.గ్రామసభలో తడి చెత్త--పొడి చెత్త వేరుచేసి పంచాయతీ ట్రాక్టర్‌లో వేయడం, ఇంకుడు గుంతల నిర్మాణం, బాత్రూముల ఏర్పాటు, వీధి దీపాల నిర్వహణ, మంచినీటి సదుపాయం, అలాగే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై చర్చ జరిగింది.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువజన సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, పంచాయతీ కార్యదర్శి నజీరా, ఫీల్డ్ అసిస్టెంట్ సన్వోజు యాదయ్య, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# శివన్నగూడ రిజర్వాయర్‌లో అక్రమ మట్టి రవాణా

## -టిప్పర్ వాహనం పట్టివేత




**మర్రిగూడ, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని శివన్నగూడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి టిప్పర్ ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.ముందస్తు సమాచారం మేరకు లెంకలపల్లి వద్ద నిఘా ఉంచి, అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

# వార్డు సభల్లో ప్రజలు భాగస్వాములవ్వాలి

## - మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్



**ఆమనగల్లు, జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రత్యేక వార్డు సభల ముఖ్య ఉద్దేశమని మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని 11, 12,13, 14, 15 వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో ఆయనతో పాటు కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు లు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం పత్యానాయక్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రానున్న వర్షకాలంలో పరిశుభ్రత పాటించాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరా ఇతర మౌలిక సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డు సభల్లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, సునీత ప్రశాంత్ నాయక్, నాగిళ్ళ జగన్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు, కో ఆప్షన్ సభ్యురాలు హలీమా బేగం, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు మరియు మున్సిపల్, మెడికల్, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, ఆయా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం

## -మంత్రులు, ప్రజాప్రతినిధులతో సమగ్ర చర్చ




**నందికొట్కూరు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల పట్టణంలో సోమవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్తో పాటు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా అభివృద్ధి కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష జరిగింది. భవిష్యత్తులో నందికొట్కూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో రోడ్లు--భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూఖ్, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐ కి ఘన సన్మానం



**ఆమనగల్లు, జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కోటేశ్వరరావు ని సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వారికీ పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ నాయక్, నర్సింహ, శంకర్ నాయక్, ప్రశాంత్ నాయక్, రవి, బాలు, వెంకటేశ్వర రెడ్డి, రాజు, రమేష్, కిషోర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## యువత రాజకీయాల్లో రాణించాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**- ఘనంగా ఫరీద్ జన్మదిన వేడుకలు**



**ఆమనగల్లు, జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
యువత రాజకీయాల్లో రాణించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం హైద్రాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేసి తినిపించి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో యువతకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఫరీద్ రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆమనగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, నాయకులు రాజు నాయక్, ప్రభాకర్ రెడ్డి, రఘు రాములు, వెంకట్ రెడ్డి, దేవరశెట్టి మహేష్, సలీం, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే అభివృద్ధి

**- సర్పంచ్ సత్యం**




**ఆమనగల్లు, జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజల సహకారంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ శానమోని సత్యం అన్నారు. మండలంలోని సింగంపల్లి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ శానమోని సత్యం ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామసభ ఎజెండా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ అన్నారు. అనంతరం ఇటీవల ఎంపీడీవో గా పదవీ బాధ్యతలు చేపట్టిన జయరాం విజయ్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీంద్ర, వార్డు సభ్యులు నర్సింహా, అయోధ్య, సదానందం, మంజుల, జ్యోతి, సెక్రటరీ కాటమయ్య, ఏఎన్ఎం కరుణాశ్రీ, ఏజీఎస్ జయమ్మ, ఫీల్డ్ ఆఫీసర్ వినోద్ రెడ్డి, ఆశా వర్కర్ సువర్ణ మరియు గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మృగశిర కార్తి ప్రారంభం



**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తొలకరి జల్లులు నేలను తాకి పుడమి పులకరించే వేళ మృగశిర కార్తె పండుగను పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రజలు ఆనందంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా రైతులు పంటలతో పొలాలు నిండాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తారు. ముఖ్యంగా ఈ రోజున చేపలు తినడం ఆచారంగా వస్తోంది. అలాగే కొంతమంది ప్రజలు తమ విశ్వాసాల మేరకు ఆస్తమా, ఉబ్బసం వంటి వ్యాధులకు చాప మందు తీసుకోవడం జరుగుతుంది. మృగశిర కార్తి రైతు ఆశల కాలం, ప్రజల ఆనంద పండుగ.

# తొలకరి పలకరింపు.. రైతన్న బిజీబిజీ










**ఆమనగల్లు, జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించడంతో తొలకరి వానలు కురిశాయి. రోహిణి కార్తి మధ్యలోనే తొలకరి పలకరించడంతో అన్నదాతలు పొలం పనుల్లో బిజీబిజీగా మారిపోయారు. పొలాల్లో చెత్త ఏరడంతో పాటు ట్రాక్టర్లతో దున్నడం, గుంటుక కొట్టడం లాంటి పనులతో దుక్కులు సిద్ధం చేశారు. ముందే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు ఎద్దు లతో సాల్లు తోలి రోహిణి కార్తి వెళ్లేలోపే పత్తి, జొన్న విత్తనాలు విత్తుకున్నారు. తరువాత వానలు రాకపోవడంతో కొంత మొలకెత్తి మట్టికింద ఆగిన విత్తనాలను మొలకెత్తించేందుకు బోరుబావులు అందుబాటులో ఉన్న రైతులు స్పింక్లర్లు పెట్టి నీటి తడులు అందిస్తున్నారు. ఆలస్యంగా దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు సమయం దాటుతుండటంతో వట్టి పాలంలోనే పత్తి విత్తనాలను విత్తుకుంటున్నారు.

## ఫిట్నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్




**నాగర్‌కర్నూల్, జూన్ 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా కొత్త విద్యా సంవత్సరం 2026--27 ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ఫిట్నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా ఆర్టీవో అధికారి ఇమ్రాన్ను కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ముక్తాల శాంతన్ మాట్లాడుతూ, "ఫిట్నెస్, లైసెన్సు, పర్మిషన్ లేని బస్సులను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. అలాగే డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి నియామకం చేయాలని, బస్సుల పరిస్థితిని నెలకొకసారి తనిఖీ చేయాలని, అజాగ్రత్త చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. "ఫిట్నెస్ లేని బస్సుల వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి స్కూల్ బస్సును తనిఖీ చేసి ఫిట్నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా చెక్ చేయాలి" అని శాంతన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, విష్ణు, జీవన్, శివ తదితర ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్ పర్యటనతో రైతులకు ఊరట



**ఖానాపూర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిర్మల్ జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా సోమవారం ఖానాపూర్ మండలంలోని బాదంగుట్టి, మస్కాపూర్, సుర్జాపూర్ గ్రామాల్లోని ఐకెపి కేంద్రాలను సందర్శించారు. వరి ధాన్యం సంచులు గుట్టలుగా పేరుకుపోయి, లారీలు లభించక రవాణా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రహదారులపై రైతులు ఆందోళన చేసిన నేపథ్యంలో కలెక్టర్ వెంటనే స్పందించి, అధికారులు పుటాహుటిన లారీలను తెప్పించి లోడింగ్ పనులు ప్రారంభించారు. దీంతో ధాన్యం వర్షాలకు తడిసిపోతుందనే భయంతో ఐకెపి కేంద్రాల వద్దే జీవిస్తున్న రైతులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా ఖానాపూర్ మండల కాంగ్రెస్ ప్రతినిధి దొరికిన దయానంద్ కలెక్టర్‌తో కలిసి రైతుల సమస్యలను వివరించారు. కలెక్టర్ చర్యలతో రైతుల్లో హర్షం వ్యక్తమైంది. లారీలు అందుబాటులోకి రావడంతో ధాన్యం రవాణా ప్రారంభమై రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రజావాణికి 121 ఫిర్యాదులు



**రంగారెడ్డి, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలి" అని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 27 దరఖాస్తులు, ఇతర శాఖలకు 94 దరఖాస్తులు అందగా, మొత్తం 121 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐని సన్మానించిన నాయకులు



**ఆమనగల్లు, జూన్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కోటేశ్వరరావు ని సోమవారం కౌన్సిలర్లు నాగిళ్ళ జగన్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం ఆధ్వర్యంలో వారికీ పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

# చట్ట పరిధిలో న్యాయానికే భరోసా : జిల్లా ఎస్పీ

**-ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 123 ఫిర్యాదులు స్వీకరణ**



**నంద్యాల, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా బొమ్మలసత్రం పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ప్రజల నుంచి 123 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపిస్తాం. నిర్ణీత గడువులోపల ఫిర్యాదులను పరిష్కరించాలి. పునరావృతం కాకుండా చూడాలి. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించరాదు" అని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**రంగారెడ్డి జిల్లా, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంచాల మండలం రంగాపూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి దిశగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. గ్రామ సర్పంచ్ నేనావత్ బాలకృష్ణ ఆధ్వర్యంలో 15వ ఫైనాన్స్ నిధులతో ఈ పనులు ప్రారంభమయ్యాయి. నందిగామ పర్వతాలు ఇంటి నుండి అరగంటి మల్లమ్మ ఇంటి వరకు, అలాగే చిలుకూరి బుగ్గయ్య ఇంటి నుండి చిలుకూరి భాషయ్య ఇంటి వరకు డ్రైనేజీ పనులు చేపట్టారు. గ్రామంలో పారిశుధ్య వాతావరణం మెరుగుపడటానికి ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కీలకంగా నిలుస్తున్నాయి.

## ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు - ఎస్సై వెంకటేశ్వర్లు



**హుస్నాబాద్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేల వరకు జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మొగిలి నాయక్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.

# 86 నూతన పూర్వప్రాథమిక పాఠశాలలు ప్రారంభం

**సిద్ధిపేట, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో నూతనంగా మంజూరైన 86 పూర్వప్రాథమిక పాఠశాలలను 2026--27 విద్యా సంవత్సరంనుంచి స్థానిక ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పాఠశాలల్లో బోధకులు, ఆయాల నియామకానికి అర్హులైన స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బోధకులుగా పనిచేయదలచిన వారు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. సంబంధిత కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఎంపికైన వారికి నెలకు రూ.8,000 గౌరవ వేతనం అందజేయనున్నారు. ఆయా పదవికి 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించి, నెలకు రూ.6,000 గౌరవ వేతనం చెల్లించనున్నారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయోసడలింపు వర్తిస్తుంది. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. జూన్ 8 నుంచి జూన్ 12 వరకు సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని, వివరాలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. సిద్ధిపేటలో 86 పూర్వప్రాథమిక పాఠశాలలు ప్రారంభం కానున్నాయి.

# రోడ్డుపై ప్రమాదకరంగా మారిన కరెంట్ పోలు మరమ్మత్తులు చేపట్టిన విద్యుత్ సిబ్బంది



**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గణేష్ నగర్ 57వ డివిజన్ కాలనీలో కరెంటు పోలు వంగి ప్రమాదకరంగా మారడంతో స్థానిక ప్రజలు కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ--శ్రీనివాసుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన వారు లైన్మెన్ సిబ్బందిని పిలిపించి మరమ్మత్తులు చేపట్టారు. అదే విధంగా మహాలక్ష్మి టిఫిన్ సెంటర్ వద్ద స్ట్రీట్ లైట్లకు సంబంధించిన కరెంటు బాక్స్‌ను కూడా సరిచేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో ముందుండే 57వ డివిజన్ కార్పొరేటర్ కృషికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ చర్యలు తీసుకుంటూ కార్పొరేటర్ ప్రజలకు అండగా నిలుస్తున్నారు.

# మృగశిర కార్తిపై రాసిన కవితతో వెలుగులోకి వచ్చిన నరేష్ ప్రతిభ



**గంగాధర, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని ఘర్షకుర్తి గ్రామానికి చెందిన ఓదెల నరేష్ పుట్టుకతో వికలాంగుడైనా కవితా రచనలో తన ప్రతిభతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సోమవారం మృగశిర కార్తెపై రాసిన కవితను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా విస్తృతంగా వైరల్ అయింది. వాతావరణ మార్పులు, రైతుల వ్యవసాయ పనులు, ప్రజల ఆరోగ్య అలవాట్లను ప్రతిబింబిస్తూ రాసిన ఈ కవితకు మంచి స్పందన లభించింది. నరేష్ డిగ్రీ, ఐటీఐ వరకు చదువుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన తల్లిదండ్రులు వృద్ధులు, పనిచేయలేని స్థితిలో ఉన్నా ఇంటికి పెద్ద ఆధారంగా నిలుస్తున్నాడు. కష్టాలను ఎదుర్కొంటూ కవితలు రాయడం, సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా సమాజానికి ఆదర్శంగా మారాడు. తన ప్రతిభను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కేసు కింద ఉద్యోగం కల్పిస్తే మంచి పేరు వస్తుందని నరేష్ ఆశాభావం వ్యక్తం చేశాడు. మృగశిర కార్తిపై రాసిన కవితతో వికలాంగుడు నరేష్ ప్రతిభ మరోసారి వెలుగులోకి వచ్చింది.

## ముంపు సమస్యపై
# అధికారుల పరిశీలన



**గంగాధర, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రజావాణి కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు గ్రామాన్ని సందర్శించారు. రిజర్వాయర్ కట్ట ఎత్తు పెంపుతో ముంపునకు గురవుతున్న ఇళ్లు, స్థలాలను పరిశీలించి గ్రామస్తులతో చర్చించారు. వర్షాకాలంలో దుర్వాసన, నీటి జాలు, కీటకాలు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నామని గ్రామస్థులు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ నివేదికను కలెక్టర్‌తో చర్చించి ప్రభుత్వానికి సమర్పించి తగిన చర్యలు చేపడతామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ నల్ల వెంకట్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ దీకొండ బాబలక్ష్మి మధు, తహసీల్దార్ రజిత, ఎస్సై వంశీకృష్ణ, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ముంపు సమస్యపై అధికారుల పరిశీలనతో గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాల అడ్మిషన్లపై అవగాహన కార్యక్రమం



**ఖానాపూర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మారుమూల గ్రామాల్లో అడ్మిషన్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తర్లపాడ్, బావాపూర్(కె) గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను వివరించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో పాటు వివిధ వృత్తి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని అధ్యాపకులు తెలిపారు. విద్యార్థులు తమ ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకుని ప్రభుత్వ విద్యా సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతున్నదని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీందర్, రమేష్, సంతోష్, జాకబ్ పాల్గొన్నారు. గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాల అడ్మిషన్లపై అవగాహన కల్పించిన అధ్యాపకులు.

# సీఐ సత్యనారాయణకు ఘన సన్మానం



**ఖానాపూర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నం సత్యనారాయణ, ఆత్మ చైర్మన్ తోట సత్యం, మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మల రమేష్, నేత శ్యామ్, మాజీ కౌన్సిలర్లు ఆమానుల కాన్, జన్నారం శంకర్, మండల కాంగ్రెస్ నాయకులు కలిసి సీఐని మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సీఐ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించడంతో ఖానాపూర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# వృద్ధురాలి ఆస్తి వివాదంపై కలెక్టర్‌కు ఫిర్యాదు




**పెద్దపల్లి, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణంలోని బండారికుంట 19వ వార్డుకు చెందిన వృద్ధురాలు అవునూరి మధునమ్మ తన నివాస స్థలం, ఇంటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. పిల్లలు లేకపోవడంతో తన ఆస్తిపై బంధువులు కన్నేశారని, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. మధునమ్మ తెలిపిన వివరాల ప్రకారం, భర్త అవునూరి నర్సయ్య 2021లో కరోనా వల్ల మృతి చెందారు. అనంతరం జీవనం సాగిస్తూ ఉన్న ఆమె ఇంటి స్థలాన్ని సలిగంటి పద్మ పేరిట రహస్యంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించినా, ఇప్పుడు తన నివాస స్థలాన్ని కూడా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని ఆమె పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మధునమ్మ, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరింది. కలెక్టర్ వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులకు విచారణకు ఆదేశించినట్లు ఆమె తెలిపింది. ఆస్తి వివాదంపై న్యాయం చేయాలని వృద్ధురాలు కలెక్టర్‌ను కోరింది.

## లయన్స్ క్లబ్ లక్ష్మినగర్లో నూతన బాడీ ఏర్పాటు




**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ లక్ష్మినగర్ 11వ ఇన్స్టలేషన్ సెరిమోనీ మైత్రి హోటల్‌లో జరిగింది. కొత్త బాడీగా లన్ పెద్ది రఘునాథ్ ఎంజేఫ్ అధ్యక్షుడిగా, లన్ బొలుసాని లక్ష్మన్ కార్యదర్శిగా, లన్ రాచమళ్ళ శ్రీనివాస్ ఖజాంచీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లన్ చిదుర సురేష్, లన్ ఎలగందుల మునిందర్, లన్ కొంజర్ల నవీన్ కుమార్, లన్ బోయినపల్లి సరళ, లన్ తనుగుల అనిల్ కుమార్, లన్ కమ్యూని తిరుమలేష్ గుప్తా, లన్ జిల్లా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. క్లబ్ సభ్యులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. లయన్స్ క్లబ్ లక్ష్మినగర్ కొత్త బాడీ బాధ్యతలు స్వీకరించింది.

# రాష్ట్రంలో త్రీ ఇన్ వన్ పార్టీ

### నందికొట్కూరు వైఎస్సార్సీపీ సమావేశంలో దారా సుధీర్ వ్యాఖ్యలు

**నందికొట్కూరు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో పార్టీ సమన్వయకర్త డాక్టర్ దారా



సుధీర్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో త్రీ ఇన్ వన్ పార్టీ ఏర్పడినప్పటి నుండి ప్రజలకు కష్టాలే. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు అమలు శూన్యం" అని విమర్శించారు. ఈ సమావేశం యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్ధ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించబడింది. ఇందులో రాష్ట్ర గ్రామపంచాయతీ వింగ్ కార్యదర్శి పుల్యాల నాగిరెడ్డి, నందికొట్కూరు పట్టణ అధ్యక్షుడు మన్సూర్ భాష, అలాగే వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘం, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వార్డు సభల్లో సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

**- మేయర్ శ్రీనివాస్**



**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత వంటి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను అధికారులు ప్రాధాన్యత క్రమంలో త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. గత పాలకులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయని, ప్రస్తుత ప్రభుత్వం త్వరలోనే అర్హులను గుర్తించి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిస్తూ మేయర్ కల్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. వార్డు సభల్లో సమస్యల త్వరిత పరిష్కారమే లక్ష్యమని మేయర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# ప్రీ ప్రైమరీ పాఠశాలలో చేరికల ప్రచారం




**గన్నేరువరం, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మైలారం గ్రామంలో నూతనంగా ప్రారంభమైన ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల చేరికల కోసం ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ప్రైవేట్ పాఠశాలలకు అధిక ఖర్చు చేయకుండా ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ చర్యపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై ఉపాధ్యాయుల అవగాహన చర్యలకు ప్రజలు స్పందన చూపుతున్నారు.

# పారువెల్ల యువకుడికి రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టులో స్థానం

**గన్నేరువరం, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామానికి చెందిన ఎల్లాల విద్యానందరెడ్డి, తెలంగాణలో జరగనున్న టీజీ20 క్రికెట్ మ్యాచ్‌లకు ఖమ్మం జిల్లా తరఫున ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి జట్టులో చోటు దక్కించుకోవడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. విద్యానందరెడ్డికి గ్రామ యువకులు, క్రీడాభిమానులు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పారువెల్ల యువకుడి ప్రతిభకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది.

# ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ అధ్యక్షతన అధ్యాపకుల సమావేశం జరిగింది. జూన్ 12 వరకు నిర్వహించే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ద్వారా అడ్మిషన్లను పెంచాలని ఆయన అధ్యాపకులను కోరారు. దోస్త్ కోఆర్డినేటర్ డా. రామకృష్ణ మాట్లాడుతూ మూడో విడత రిజిస్ట్రేషన్లకు జూన్ 15 వరకు, వెబ్ ఆప్షన్లకు జూన్ 16 వరకు గడువు ఉందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 20 నుంచి 25లోపు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ద్వారా అడ్మిషన్లు పెంచాలని ప్రిన్సిపాల్ రామకృష్ణ సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యం

**- ఎమ్మెల్యే సత్యనారాయణ**




**మానకొండూర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజల సమస్యలను నేరుగా ఆలకించి స్పందించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 43 మంది ఫోన్ ద్వారా పాల్గొని ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, వ్యవసాయ ఇబ్బందులు, రెవెన్యూ సమస్యలు వంటి అంశాలను ప్రస్తావించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, కొన్ని అంశాలపై వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, మండల స్థాయి అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వ్యవసాయ కళాశాల, 50 పడకల ఆస్పత్రి వంటి ప్రాజెక్టులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని, అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి స్పష్టం చేశారు.

# రైతులకు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు



**హుస్నాబాద్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఎల్ నినో ప్రభావంతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వాణి సూచించారు. మీర్జాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేపట్టాలని, పప్పుధాన్యాలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీపీఎం వాసుదేవ్ మాట్లాడుతూ పల్లె మహిళా జీవనోపాధి కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏపీఎం తిరుపతి భూసారాభివృద్ధి, చెరువుల పూడిక తొలగింపు పనులు చేపట్టినట్లు, అలాగే ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు దిశగా రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వాసన్ ఎన్జీవో ప్రతినిధి అనిల్ సమగ్ర నివేదిక ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. వ్యవసాయ అధికారి పూజ రైతులందరూ పంట మార్పిడి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ సంపత్ కుమార్, జవహర్, బిక్షపతి, ఏఈవో సంగీత, ఉపసర్పంచ్ లుస్వర్ణకుమార్, వీవో అధ్యక్షులు వాణి, భారతి, శారద, వీవోఏలు సుదర్శన్, సునీత, నిర్మలతో పాటు మహిళలు, రైతులు పాల్గొన్నారు. పంట మార్పిడి ద్వారా సమగ్ర వ్యవసాయం రైతులకు స్థిరమైన ఆదాయం కల్పిస్తుందని అధికారులు సూచించారు.

# ఎన్నికల విధుల బకాయిలు చెల్లించాలని ఫొటోగ్రాఫర్ల నిరసన

**మంచిర్యాల, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పనిచేసి రెండేళ్లు గడిచినా బకాయిలు అందకపోవడంతో మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు కలెక్టరేట్‌లో ఆందోళన చేపట్టారు. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వి. రాములకు వినతిపత్రం అందజేసి, రూ.4 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు తెలిపారు. ఎన్నికల సమయంలో నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించినప్పటికీ ఇప్పటివరకు పారితోషికం విడుదల కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్ సమస్యను పరిశీలించి త్వరలోనే బకాయిలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కుల రాజు, కుమారస్వామి, పరమేష్, మల్లేష్, శ్రీనివాస్‌తో పాటు పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఎన్నికల విధులు నిర్వహించి రెండేళ్లు గడిచినా బకాయిలు అందకపోవడం అన్యాయమని ఫొటోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ డిమాండ్




**హుస్నాబాద్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని, అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల వనరుల కేంద్రంలో వినతిపత్రం సమర్పించారు. జూన్ 15 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ముందుగానే అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. మరుగుదొడ్ల శుభ్రత, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల్లో బల్లలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు ఇష్టారాజ్యంగా విక్రయించడం ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన ఆరోపించారు. సరైన మౌలిక వసతులు లేకపోయినా యథేచ్ఛగా నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, సంయుక్త కార్యదర్శులు రంజిత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది.

# విద్యే శక్తి, విద్యే భవిష్యత్తు -- బడిబాటే ఆ భవిష్యత్తుకు బంగారు బాట



**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో బడిబాట ప్రచార గీతాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆవిష్కరించారు. ప్రతి చిన్నారి పాఠశాల బాట పట్టాలని, ప్రతి గ్రామం విద్యా వికాసానికి నిలయంగా మారాలని సంకల్పంతో రూపొందించిన ఈ గీతం ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విద్యా ఉద్యమంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి, సమన్వయకర్తలు అశోక్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. జడ్పీహెచ్‌ఎస్ ఒద్యారం పాఠశాలకు చెందిన మాజీ మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, రచయిత వెంకటేశ్వర్లు, కె.బి. శర్మ కృషితో ఈ గీతం రూపొందింది. ప్రతి ఇంటి నుండి ఒక అడుగు బడివైపు, ప్రతి గ్రామం నుండి ఒక అడుగు విద్యావైపు అనే సందేశంతో రూపొందిన ఈ గీతం జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమానికి స్ఫూర్తినిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది. విద్యే శక్తి, విద్యే భవిష్యత్తు -- బడిబాటే ఆ భవిష్యత్తుకు బంగారు బాట.

# ఎల్పీజీ ధరలపై కాంగ్రెస్ నిరసన




**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన ఎల్పీజీ గ్యాస్ ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద భారీ వంటావార్పు కార్యక్రమం జరిగింది. ఖాళీ సిలిండర్లతో, కట్టెల పొయ్యిలపై వంట చేస్తూ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ, గ్యాస్ ధరలు ఒకేసారి రూ.29 పెరగడం పేద, మధ్యతరగతి ప్రజలపై భారమని విమర్శించారు. 2014లో రూ.400 ఉన్న సిలిండర్ నేడు రూ.1200 దాటిందని, సబ్సిడీ ఎత్తివేయడంతో మహిళలు మళ్లీ కట్టెల పొయ్యిల వైపు మొగ్గుతున్నారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న మాట్లాడుతూ, గ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రం వెంటనే ధరలు తగ్గించి పాత సబ్సిడీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వెలిచాల రాజేందర్ రావు ఇంటి నుంచి గీతా భవన్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీగా తరలి వచ్చి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఎల్పీజీ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.


# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు డిమాండ్



**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని కోరారు. వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు.గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ, జీఓ నెం.51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ ప్రాధాన్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, కనీసం రూ.30,000 అంత్యక్రియల సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్కపల్లి సారయ్య, ఆకునూరి సుధాకర్, బొజ్జా మధు, మైసా లక్ష్మి, వడ్లూరి లక్ష్మినారాయణ, ఎండిగ రవీందర్ రావు, కాశిపాక శంకర్, దాసారపు జంపయ్య, పోతుల రమేష్, గాజర్ల రాజు, లద్దునూరి కుమార్, పెరుగు అశోక్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని సిఐటియు నేతలు స్పష్టం చేశారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించాలి


**అధికారులు క్రమశిక్షణతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు**



**నంద్యాల, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను నాణ్యతతో, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి. పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలి" అని అధికారులను ఆదేశించారు. జూన్ 10 నుంచి 19 వరకు ప్రభుత్వం ప్రత్యేక థీమ్‌లతో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా జూన్ 13న 'బంగారు కుటుంబం' కార్యక్రమం జరగనుందని, దాదాపు 5 వేల మంది పాల్గొనేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్య ప్రణాళికాధికారి (సీపీఓ)ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అలాగే జూన్ 10 నుంచి 20 వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఔట్‌రీచ్ కార్యక్రమాలకు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో కొందరు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, బియాండ్ ఎస్ఎల్ఏ కేసులను వెంటనే పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రీ-ఓపెన్ కేసులను వచ్చే సోమవారం నాటికి క్లియర్ చేయాలని, లక్ష్యాలను సాధించడంలో విఫలమయ్యే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలితాలు





**మేషరాశి**
ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. పనులు చకచకా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధిగమిస్తారు. అదృష్ట రంగు :ఎరుపు
సంఖ్య: ఒకటి

**వృషభరాశి**
ప్రయాణాల మధ్యలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. వృధా ఖర్చులు పెరుగుతాయి. దైవచింతన కలుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలు అంతగా అనుకూలించవు. వ్యాపారాలు అధిక కష్టంతో అల్ప ఫలితాన్ని పొందుతారు.
అదృష్ట రంగు: తెలుపు
సంఖ్య :2

**మిధునరాశి**
బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. గృహమున బాధ్యతలు చికాకు పరుస్తాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వ్యాపారమున ఆలోచించి ముందుకు సాగడం మంచిది. ఉద్యోగాలు కొంత గందరగోళంగా ఉంటాయి. అదృష్ట రంగు :ఆకుపచ్చ సంఖ్య :3

**కర్కాటకరాశి**
ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. ఎంతటి వారినైనా మీ మాట తీరుతో ఆకట్టుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తొలగుతాయి. వ్యాపార వ్యవహారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగులకు అధికారుల అండదండలు లభిస్తాయి. అదృష్ట రంగు: మెరున్ రంగు సంఖ్య :4

**సింహరాశి**
ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. అదృష్ట రంగు: బంగారం రంగు సంఖ్య :5

**కన్యరాశి**
నూతన ఉద్యోగ యోగం ఉన్నది. కుటుంబ విషయంలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దీర్ఘకాలిక ఋణబాధలు తొలగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగాలలో ఆశించిన స్థానచలనాలు కలుగుతాయి. అదృష్ట రంగు :ఆకుపచ్చ సంఖ్య: 6

**తులరాశి**
ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. మిత్రుల నుంచి ఋణ ఒత్తిడి అధికమవుతుంది. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు గందరగోళంగా సాగుతాయి. అదృష్ట రంగు :తెలుపు
సంఖ్య :7

**వృశ్చికరాశి**
ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు కలుగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. అధిక శ్రమతో కానీ పనులు పూర్తి కావు. స్వల్ప అనారోగ్య సమస్యలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి. అదృష్ట రంగు: మెరూన్
సంఖ్య :7

**ధనస్సురాశి**
సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మిత్రులతో సఖ్యత నెలకొంటుంది. ముఖ్యమైన పనుల్లో విజయం సాధిస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. అదృష్ట రంగు: పసుపు
సంఖ్య: 9

**మకరరాశి**
వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. బంధువుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. ఉద్యోగాలలో శ్రమ మరింత అధికం అవుతుంది. అదృష్ట రంగు: నీలం
సంఖ్య :1

**కుంభరాశి**
బంధువుల నుండి అందిన శుభవార్తలు ఉత్సాహాన్నిస్తాయి. సోదరులతో భూవివాదాలు కొలిక్కి వస్తాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. అదృష్ట రంగు: నీలం
సంఖ్య: 2

**మీనరాశి**
నూతన ఋణ యత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టకపోవడం మంచిది. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. అదృష్ట రంగు :పసుపు
సంఖ్య :3

(రాశి ఫలాలు నిపుణుల సూచనలతో అనుసరించండి)

**శ్రీ కాలభైరవ ఉపాసకులు**
**దక్క జంబులయ్య (స్వామి )**
**9491163914**



# తెలంగాణ రక్షణ సేన వినూత్న నిరసన



**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్పీజీ గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కరీంనగర్ ధర్నా చౌక్‌లో వినూత్న నిరసన కార్యక్రమం జరిగింది. కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ నేతలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.జిల్లా నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటామని చెప్పి గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజలను మళ్లీ కట్టెల పొయ్యిల వైపు నెట్టేస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం మూడు నెలల్లోనే మూడు విడతలుగా ధరలు పెంచి బడుగు వర్గాల నడ్డి విరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రం వెంటనే ధరలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని, లేకపోతే జిల్లాలో పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, అధివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, చెన్నమల్ల చైతన్య, బుడిగె పరుశురాం గౌడ్, బసవేణి రాజేందర్, గాలిపెల్లి రత్నాకర్ చారి, జంగా అపర్ణ, కుతాడి రజిత, దాసరి అంజలి, లింగంపల్లి శ్రీనివాస్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్యాస్ ధరలు తగ్గించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని తెలంగాణ రక్షణ సేన హెచ్చరించింది.

# పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని పిడిశెట్టి రాజు డిమాండ్



**కరీంనగర్, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరగడం వల్ల రైతులు, చిరు వ్యాపారులు, కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆవేదన వ్యక్తం చేశారు.మొలంగూర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ప్రజలకు అనుగుణంగా ధరలను నియంత్రించాయని, కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేస్తూ సామాన్యులపై భారాన్ని మోపుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుస్తూ ప్రజలకు అందాల్సిన సంపదను దూరం చేస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు.పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పాలేపు తిరుపతి ముదిరాజ్, నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు సమ్మయ్య, రానవేణి రమేష్ తదితరులు పాల్గొన్నారు. సామాన్యులపై భారాన్ని తగ్గించేందుకు ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని పిడిశెట్టి రాజు డిమాండ్ చేశారు.

# పని ఒత్తిడి చేసిన వారిపై చర్యలు కోరిన రెవెన్యూ అధికారులు

**మహమ్మద్ హుస్సేన్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్**



**నందికొట్కూరు, జూన్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కర్నూలు జిల్లాలో పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి మహమ్మద్ హుస్సేన్ మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిని నర్సరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు నందికొట్కూరు తహసీల్దారు కార్యాలయంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నర్సరాజు మాట్లాడుతూ, "హుస్సేన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచి వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్లు చర్యలు చేపట్టాలి" అని అన్నారు. అలాగే గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సహాయకులపై ఉన్న పని ఒత్తిడిని తగ్గించేందుకు సింగిల్ లైన్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ సర్వేయర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా నాయకుడు మహేష్ మాట్లాడుతూ, "సహాయకులను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సరియైన పే స్కేలు అమలు చేయాలి. వారి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బుద్ధకవి, ఏపిజిఈఎ నాయకులు జగదీష్, శ్రీనివాసులు, విఆర్వోలు ఆనంద్, సురేష్, వెంకటేష్, మనోహర్ గౌడ్, హనుమంతు, మనోహర్, స్వాములు, సుజిత, నవ్య, అంజాద్, రామకృష్ణ, అలాగే గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.